క్లుప్తంగా

పోర్ట్‌ఫోలియో జడ్జిని కలిసిన న్యాయవాదులు


పోర్ట్‌ఫోలియో జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

చివ్వెంల : సూర్యాపేట జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ మాధవిదేవిని శుక్రవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సూర్యాపేట జిల్లా కోర్టులోని పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పార్కింగ్, వాటర్, నూతన భవన నిర్మాణ స్థల సమస్యలకు ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, గేమ్స్ సెక్రటరి జీలకర్ర చంద్రమౌళి, జీపీ రమావత్ పూల్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణ పనుల పరిశీలన


పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు

తుంగతుర్తి : మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనునాయక్, ఎస్ఐ ఏడుకొండలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు డాక్టర్ తన్నీరు సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. అయితే వైద్యం కోసం సీఎంఆర్ ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వెంటనే సీఎంఓ అధికారులతో మాట్లాడి ఒక్క రోజులోనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షలు మంజూరు చేయించారు. దీంతో ఎల్‌ఓసీ కాపీని కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్యే కుమారుడు మందుల సూర్యకిరణ్ శుక్రవారం సత్యనారాయణ కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మోరపాక సత్యం, దోరెపల్లి మధు, రమావత్ శంకర్, భీముడు, వీరయ్య పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు


నూతనంగా వేసిన బోరు

ఎఫెక్ట్..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెంలో తలెత్తిన నీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. 'రామన్నగూడెంలో నీటి సమస్య' అనే శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో బోరు వేయించి మోటార్‌ను బిగించి నీటిని వదిలారు. ఈ నీటిని ట్యాంక్‌కు ఎక్కించి గ్రామానికి సరఫరా చేయనున్నట్లు ఎంపీడీఓ తుమ్మల పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్‌రావు తెలిపారు. గ్రామంలోని చెలిమబావి నీళ్లు కలుషితమైనందున తాత్కాలికంగా నిలిపివేశామని చెప్పారు. కొత్తగా బోర్లు కూడా వేయిస్తామని తెలిపారు. గ్రామస్తులకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థికసాయం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన బత్తుల వీరస్వామి భార్య బత్తుల రజిత డెంగీకి గురైంది. దీంతో ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో హైదారాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే విషయం తెలిసిన డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి వెంటనే స్పందించి వైద్య ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థికసాయాన్ని శుక్రవారం బాధితురాలి కుటుంబీకులకు అందజేశారు. అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నర్ర సురేష్, గుంటిగొర్ల వాసు, సూరారపు బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి దరఖాస్తుల వెల్లువ

- మూడు రోజుల్లో ఒక్క తిరుమలగిరిలోనే 370 దరఖాస్తులు
- అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని రైతుల వేడుకోలు


తొండ గ్రామంలోని రైతు వేదికలో దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతలుగా రుణమాఫీ చేసినా అనేక మంది రైతులకు లబ్ధి చేరకపోవడంతో వారంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం జూలై 18న మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలు, జూలై 30న రూ.1.50 లక్షల లోపు, ఆగస్టు 15న మూడవ విడతలో రూ.2 లక్షల వరకు రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. కానీ జాబితాలో కొంత మంది రైతుల పేర్లు లేకపోవడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల నుంచి దరఖాస్తులు..

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం మంగళవారం నుంచి రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. శుక్రవారం వరకు తిరుమలగిరిలో 370 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలుపుతున్నారు.

మూడు విడతల్లో మాఫీ..

తుంగతుర్తి నియోజకవర్గంలో గత నెల మొదటి విడతగా 18542 మంది రైతులకు రూ.151 కోట్ల 59 లక్షల 77 వేల 21రూపాయలు, రెండవ విడతలో 10239 మంది రైతులకు రూ.133 కోట్ల 93 లక్షల 55 వేల 708 రూపాయలు, మూడవ విడతలో 6642 మంది రైతులకు రూ.115 కోట్ల 88 లక్షల 37 వేల 241 రూపాయలను ప్రభుత్వం మాఫీ చేసింది. అయితే కుటుంబ సభ్యులకు రేషన్ కార్డు లేకపోవడం, ఒకే కుటుంబం నుంచి రూ.2 లక్షలు రుణం తీసుకోవడం, కొన్ని బ్యాంకుల్లో ఆధార్ కార్డు తప్పుగా నమోదు కావడం తదితర కారణాలతో చాలామంది రైతులకు రుణమాఫీ అందక ఆందోళన చెందుతున్నారు.

పేరు తప్పుగా నమోదైంది


నా ఆధార్ కార్డులో, బ్యాంకు పాస్ పుస్తకంలో ఇంటి పేరు తప్పుగా నమోదు కావడంతో రుణమాఫీ డబ్బులు జమ కాలేదు. రుణమాఫీ కోసం దరఖాస్తు చేశాను.

– విజయ్ గోపాల్‌రెడ్డి, వెలిశాల

రూ.2 లక్షలకు పైగా ఉంటే మాఫీ కాలేదు


ఏపీజీవీ బ్యాంకులో రూ.2 లక్షల రుణం తీసుకున్నాను. వడ్డీతో కలిసి ప్రస్తుతం రూ.2.40 లక్షలు అయ్యింది. దీంతో నాకు రుణమాఫీ కాలేదు. ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలి.

– ధరావత్ సజ్జన్, ఖోక్యానాయక్ తండా

రేషన్ కార్డు అందరికీ ఒక్కటే ఉంది


నేను ఏపీజీవీ బ్యాంకులో రూ.1.50 లక్షలు రుణం తీసుకున్నాను. మా తమ్ముడు కూడా అదే బ్యాంకులో రూ.98 వేలు రుణం తీసుకున్నాడు. ఇద్దరికి ఒక్కటే రేషన్ కార్డు ఉండటంతో రుణమాఫీ జరుగలేదు.

– బానోతు కిషన్, మర్రికుంట తండా

నూతన టెక్నాలజీతో ముందడుగు వేయాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ ముత్యాల రాజు


హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

సూర్యాపేటటౌన్ : ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకొని నూతన టెక్నాలజీతో ముందడుగు వేయాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ డి.కిరణ్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ ముత్యాల రాజు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆత్మవిశ్వాసంతో చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తూ 200లకు పైగా ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. కళాశాలలో చేరిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఎస్.రాజేశ్వర్, సెక్రటరీ చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు.

హాస్టళ్లలో మెనూ పాటించడంలో నిర్లక్ష్యం


మాట్లాడుతున్న గోపగాని రవికుమార్

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లాలోని పలు బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పాటించడంలో వార్డెన్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు హాస్టళ్లను సందర్శించి మాట్లాడారు. చాలామంది వార్డెన్లు హాస్టళ్లకు అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి భోజనం తింటున్నారో కూడా వార్డెన్లు గమనించట్లేదని అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ నాయకులు అభిరామ్, కె.రవి, ఎం.శివ, చేతన్ పాల్గొన్నారు.

పెన్షనర్లకు జిల్లాస్థాయి చెస్ పోటీలు


చెస్ పోటీల్లో పాల్గొన్న పెన్షనర్లు

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సుదర్శన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాస్థాయి చెస్, క్యారమ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో పెన్షనర్లు నూతన ఉత్తేజాన్ని పొందవచ్చని తెలిపారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం సూర్యాపేట మండల అధ్యక్షుడు దండా శ్యాంసుందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, కోదాడ యూనిట్ అధ్యక్షుడు వి.శ్రీనివాస రావు, హుజూర్‌నగర్ అసోసియేట్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్ .రాజు, సూర్యాపేట యూనిట్ కార్యదర్శి ఎస్.నాగేశ్వర్ రావు, కె.సురేందర్‌రెడ్డి, బి.వీరయ్య, టి.లక్ష్మీకాంత రెడ్డి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి


పెన్‌పహాడ్ : నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది


మద్దిరాల : ముకుందాపురంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మద్దిరాల : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య అన్నారు. శుక్రవారం ముకుందాపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి బ్లాక్‌డేగా పాటిస్తూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మెరుగు విష్ణుకుమార్, ఉప్పు క్రిష్ణయ్య, భైరు తిరుమలేష్, బుస్సా వెంకటేశ్వర్లు, కొరివి మధు, ఎండీ అలీం పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగుల నిరసన

పెన్‌పహాడ్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జీఓ నంబర్ 28ని తీసుకొచ్చిన ఆగస్టు 23ను బ్లాక్ డేగా పరిగణిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించినట్లు పేర్కొన్నారు. వెంటనే జీఓను రద్దు చేసి, పాత పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కోశాధికారి గుయ్యాని ప్రసాద్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ సంజీవయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సంపత్ కుమార్, మహేష్, సతీష్, జానకిరాములు, దివ్య భారతి, నాగరాజు, మోక్షిత్, వెంకన్న పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్


తిరుమలగిరిలో గాయపడ్డ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని వంద శాతం అమలు చేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. తిరుమలగిరిలో గురువారం జరిగిన ఘర్షణలో గాయపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలను శుక్రవారం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీని పూర్తిగా అమలుచేస్తుందని అన్నారు. చిన్న చిన్న సాంకేతిక సమస్యలతో రుణమాఫీ జరగని రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 35 వేల మంది రైతులకు 401 కోట్ల 41 లక్షల 69 వేల 970 రూపాయలు మాఫీ అయ్యాయని తెలిపారు. రుణమాఫీ విషయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వ్యవసాయ అధికారులకు, జిల్లా కలెక్టర్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో లక్ష రూపాయల రుణమాఫీని నాలుగు విడతలుగా చేస్తే వడ్డీకే సరిపోలేదన్నారు. మాజీ మంత్రులు కేసీఆర్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిలు రైతులను ఎన్నడూ పట్టించుకోలేదని ఆరోపించారు. తిరుమలగిరిలో జరిగిన సంఘటనలపై డీజీపీకి ఫిర్యాదు చేయడానికి సిగ్గుండాలని విమర్శించారు. గత పది సంవత్సరాలుగా నియోజకవర్గంలో దోపిడీ రాజ్యమేలిందని తెలిపారు. ఇసుకను దోపిడీ చేశారని, చిర్రగూడూరులో ఇసుకను అడ్డుకున్న మహిళలపై దాడులు చేశారని, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నగేష్‌పై దాడి చేశారని, అడ్వకేట్ యుగేంధర్‌పై కర్రలతో దాడి చేశారని, తుంగతుర్తిలో వెలుగు అంజయ్యను, ఫణిగిరిలో అల్లయ్యను చంపారని అన్నారు. ఈ సంఘటనలపై ఎప్పుడైనా విచారణ జరిపారా అని ప్రశ్నించారు. రైతుల సమస్యలు తెలుసుకోవడానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తుంగతుర్తి నియోజకవర్గానికి వస్తే రాళ్ల దాడి చేసింది ఎవరో చెప్పాలని అన్నారు. గత పదేళ్లగా నియోజకవర్గంలో అరాచక పాలన సాగిందని అన్నారు. రైతులను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, మండల అధ్యక్షుడు నరేష్, అయిలమల్లు, సత్యం, పాలకుర్తి రాజయ్య, పి.చంద్రశేఖర్, అశోక్‌రెడ్డి, సుంకరి జనార్దన్, అంబేద్కర్, జితేందర్, హఫీజ్, సలీమ్‌పాషా పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం రానున్నట్లు తహసీల్దార్ కంఠమయ్య శుక్రవారం తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

మద్దిరాల : మద్దిరాల మండలంలో శనివారం ఎమ్మెల్యే మందుల సామేల్ పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, మద్దెల భిక్షపతి, బానోతు మాన్‌సింగ్, తాళ్లపెల్లి కంఠం పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చేది కాంగ్రెస్సే

తిరుమలగిరి : ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడింది కాంగ్రెస్ పార్టీ అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎర్ర యాదగిరి అన్నారు. శుక్రవారం తాటిపాములలో రైతులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నాయిని కృష్ణ, నర్సయ్య, కోల కృష్ణయ్య, వెంకటయ్య, యాదగిరి, గట్టయ్య, వీరస్వామి, బాబు పాల్గొన్నారు.

తుంగతుర్తి ఏడీఏగా రమాదేవి

తుంగతుర్తి : తుంగతుర్తి వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ)గా బి.రమాదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో రంగారెడ్డి జిల్లా చేవేళ్ల వ్యవసాయ సహాయ సంచాలకులుగా పనిచేసి బదిలీపై తుంగతుర్తికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీఏ జగ్గునాయక్ మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌కు బదిలీ అయ్యారు.

పాఠశాలకు కుర్చీల అందజేత

సూర్యాపేట రూరల్ : సోలిపేటలోని ప్రభుత్వ పాఠశాలలో గత 24 ఏళ్లుగా అటెండర్‌గా పనిచేస్తున్న నూనావత్ వెంకట్రామ్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ ఆ పాఠశాలకు రూ.6 వేలు విలువగల కుర్చీలు, గోడ గడియారం అందజేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు అటెండర్‌గా ఉద్యోగ విరమణ పొందిన వెంకట్రామ్‌ను ఘనంగా సన్మానించారు.

అప్రమత్తంగా ఉండాలి

నాగారం : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఐలయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లా ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న, ఎల్లయ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఐలయ్య

పాఠశాలల్లో అంతరిక్ష దినోత్సవం


పెన్‌పహాడ్ : ఇస్రో శాస్త్రవేత్త చెరుకుపల్లి వెంకటరమణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


అర్వపల్లి : అంతరిక్ష దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తున్న సైన్స్ ఉపాధ్యాయురాలు మల్లిక

పెన్‌పహాడ్ : జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం ఇస్రో సీనియర్ శాస్త్రవేత్త చెరుకుపల్లి వెంకటరమణను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఇస్రో సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. చంద్రయాన్-3 గురించి పవర్ ప్రజెంటేషన్ చేశారు. అదే విధంగా ఆదిత్య-ఎల్1, గగన్‌యాన్ వంటి వాటి గురించి తెలియజేశారు. వాతావరణ నావిగేషన్, టెలీ ఎడ్యుకేషన్, టెలీ మెడిషన్ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జె. వెంకటేశ్వర్లు, ఎంఈఓ ఎస్.రవి, జెడ్పీహెచ్ఎస్, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు మల్లిక జాతీయ అంతరిక్ష దినోత్సవ ప్రాముఖ్యను వివరించారు. చంద్రయాన్-3 విజయవంతమైన ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవంగా పాటిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు విక్రమ్ ల్యాండర్ బొమ్మలను తయారుచేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కె.చినవెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గద్దర్ గాన సంస్మరణ సభ పోస్టర్ల ఆవిష్కరణ


అర్వపల్లిలో సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళాకారులు

తిరుమలగిరి : ఈ నెల 28న సూర్యాపేటలో జరిగే గద్దర్ గాన సంస్మరణ సభను విజయవంతం చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు తిరుమలగిరిలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బహుజన యుద్ధ నౌక డాక్టర్ ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో ఈ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడెం లింగయ్య, తన్నీరు రాంప్రభు, పత్తేపురం యాదగిరి, ప్రవీణ్, యాకన్న, రామ్మూర్తి, యాదగిరి, వెంకన్న, శ్రీను, బ్రహ్మం, రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

అర్వపల్లి : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 28న ఏపూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గద్దర్ గాన స్మరణం సభను జయప్రదం చేయాలని అర్వపల్లిలో శుక్రవారం కళాకారులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజాయుద్ధనౌక గద్దర్‌ను స్మరించుకుంటూ గాన స్మరణం సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వెన్నెల, ఏపూరి సోమన్న, పూలే-అంబేద్కర్ ఆశయ పోరాటసమితి అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య, ఉపాధ్యక్షుడు నక్కల సురేందర్, మేడిపల్లి వేణు పాల్గొన్నారు.


తిరుమలగిరిలో..

26నుంచి వ్యవసాయ కార్మిక శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న కడియం కుమార్

నాగారం : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26, 27, 28 తేదీలలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కండె భిక్షం, జి.వెంకటేశ్వర్లు, రాములు, స్వరూప, సోమమ్మ, అంజయ్య, పద్మ, రాములమ్మ, మల్లయ్య పాల్గొన్నారు.

అర్వపల్లి : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26, 27, 28 తేదీలలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి తరగతులను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియంకుమార్ కోరారు. శుక్రవారం అర్వపల్లిలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చెన్నబోయిన వీరయ్య, శ్రీను, నర్సయ్య, రాములు, సైదమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం


చివ్వెంల : పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న అధికారులు


ఎస్ఐ వీరన్నను సన్మానిస్తున్న నాయకులు

చివ్వెంల : ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు పంచాయతీ కార్యదర్శులను మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఎంపీఓ దయాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ నాయుడు, టీఏలు రమాదేవి, దుర్గాభవాని, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల నూతన ఎస్ఐకి సన్మానం

మద్దిరాల : మద్దిరాల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ వీరన్నను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్ శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొబ్బిలి వెంకన్న, పాక అమృతమల్లు, తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, మద్దెల భిక్షపతి, మాన్‌సింగ్, శ్యాంరెడ్డి, పొన్నం వెంకన్న, చెన్ను, పాలబిందెల శ్రీనివాస్, నాగరాజు, కంఠం, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిలువ ఉన్న నీటి తొలగింపు

అర్వపల్లి : కొమ్మాల గ్రామంలో శుక్రవారం పల్లె దవాఖానా ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లలోని నిలువ ఉన్న నీటిని తొలగించారు. అలాగే మురుగు కాలువలు, వీధులలో ఆయిల్‌బాల్స్ వదిలారు. డ్రై డే ప్రాధాన్యతను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వర్షిత, హెల్త్ అసిస్టెంట్లు ఎ.సరస్వతి, శ్రీను, ఊర్మిళ, ఆశా కార్యకర్త రోజ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

అర్వపల్లి : దోమల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల సామాజిక ఆరోగ్య అధికారి బిచ్చునాయక్ అన్నారు. అర్వపల్లిలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియజేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాధులు దోమలతో ఒకరి నుంచి ఒకరికి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ పి. వేణుగోపాల్‌రావు, హెచ్‌ఎం ఎ. వీరాచారి, మహేష్‌గౌడ్, ఆశా కార్యకర్తలు మామిడి అరుణ, మాగి స్వరూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి..

నూతనకల్ : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌ఓ చరణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం తాళ్లసింగారం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి.సోమయ్య, జి.సోమని.ఝాన్సీ, వైద్య సిబ్బంది, ఆశకార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.